క్లుప్తంగా

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం



తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారు

అంబాజీపేట: తొండవరం గ్రామంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ముక్కామలలో వేంచేసియున్న గ్రామ దేవత లంకాలమ్మ అమ్మవారి తీర్థం జరిగింది. ఆయా గ్రామాల ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముక్కామలలో అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



108 అంబులెన్స్‌లో తల్లీ, బిడ్డతో ఈఎంటీ చిట్టిబాబు

రావులపాలెం: ఓ గర్భిణి పురిటి నొప్పులతో 108 వాహనంలో ఆస్పత్రికి వెళుతూ మార్గమధ్యలో సుఖ ప్రసవంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఊబలంకకి చెందిన శీలం భవాని పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆమెను తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఫిట్స్ అధికమవడంతో రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. వెంటనే అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో ఆమెను రాజమహేంద్రవరం తరలిస్తుండగా వేమగిరి దాటాక పురిటి నొప్పులు అధికమై బిడ్డ బయటకు వస్తుండగా మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) యలంకి చిట్టిబాబు, అంబులెన్స్ డ్రైవర్ (పైలెట్) సీహెచ్ దేవేంద్రబాబు సహాయంతో చాకచక్యంగా సుఖ ప్రసవం చేసి బిడ్డను సురక్షితంగా బయటకు తీశారు. తల్లీ, బిడ్డకు వైద్య సదుపాయం అందిస్తూ రాజమహేంద్రవరం జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. దానితో ఆ మహిళ తల్లిదండ్రులు, బంధువులు అంబులెన్స్ సిబ్బంది చిట్టిబాబు, దేవేంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు ప్రయోజనం

మామిడికుదురు: నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం పెదపట్నంలంకలో జరిగింది. దీనిలో భాగంగా పలువురికి ఉచితంగా ఈసీజీలు తీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలందించారు. సుమారు 70 మందికి ఉచితంగా వైద్య సేవలందించి మందులు అందజేశారు. ప్రతి గ్రామంలో నెలకు రెండు దఫాలు ప్రభుత్వ డాక్టర్ అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తున్నారని కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పి.నాగమణి, తల్లీనాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుమలత

రావులపాలెం: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుమలత అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని గోపాలపురం, ఊబలంక సీహెచ్‌సీల వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సుమలత మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న గ్రామాలలో గర్భిణులను సకాలంలో గుర్తించి ప్రసవం జరిగే వరకు వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. పుట్టిన ప్రతి శిశువుకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కిల్కారి యాప్ ద్వారా గర్భిణీ స్త్రీల పోషకాహారం, నవజాత శిశు సంరక్షణ గురించి గర్భిణుల ఫోన్లకు సమాచారాన్ని అందించాలన్నారు. మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వైద్య సేవలు అందించాలన్నారు. అలా గే ప్రజలకు దగ్గరగా వైద్య సేవలు అందించడానికి 'ఇంటింటికీ డాక్టర్' అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని వివరించారు. సమావేశంలో వైద్యులు హసీనా, స్వాతి, సాయిలేఖ, సీహెచ్‌ఓలు జీఎస్ఎస్ రాంబాబు, ఎస్.కాంతమ్మ, ఎంపీహెచ్ఈవోలు ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ అనురాధ, ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డి సేకరణ యంత్రం.. లాభదాయకం

- గడ్డిని కాల్చవద్దంటున్న వ్యవసాయశాఖ
- స్ట్రాబేలర్ యంత్రాలు వినియోగించాలని వినతి



పెదపళ్లలో గడ్డిని సేకరిస్తున్న స్ట్రాబేలర్ యంత్రం

అలమూరు: వరిసాగులో అధునాతన వరికోత యంత్రాలు అందుబాటులో రావడంతో పశుగ్రాసానికి ఉపయోగించే ఎండుగడ్డి ఇప్పటి వరకూ నిరుపయోగంగా మారింది. దీనివల్ల పాడిరైతులను ఎండుగడ్డి కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలకు చెందిన రైతులు ఈ గడ్డి కొరతను నివారించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి సేకరణ యంత్రం (స్ట్రాబేలర్)ను ఉపయోగిస్తున్నారు. ఆ యంత్రం ద్వారా సేకరించే గడ్డితో అధికశాతం మేర పశుగ్రాసం కొరతను తీర్చేందుకు అవకాశం ఏర్పడింది. ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలు అమర్చే విధంగానే స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డి సేకరణ జరుపుతుండటం వల్ల ఇటు రైతులకు, అటు కొనుగోలు దారులకు లాభదాయకంగా ఉంటుంది. గతంలో స్థానికంగా ఉండే పాడి రైతులు ఒక వేళ గడ్డిని సేకరిద్దామనుకున్నా వ్యయ ప్రయాసలు ఎక్కువగా ఉండటం వల్ల యంత్రంతో కోసిన వరిగడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టి కాల్చేవారు. దీంతో ఎండుగడ్డి పనికి రాకుండా పోవడంతో రైతులను గడ్డి కొరత వేధిస్తూ ఉండేది. కొంత మంది రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో కోయించి వరిగడ్డిని భద్రపరచుకునే వారు. ఇలాంటి తరుణంలో గోసంరక్షణ కేంద్రాలకు, డైరీఫాంలకు, పేపర్ మిల్లులకు ఎండుగడ్డి సేకరణ కష్టసాధ్యమైంది. దీంతో వారంతా స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ట్రాక్టర్ల సాయంతో పొలాల్లో వ్యర్థంగా పడి ఉన్న ఎండుగడ్డిని సేకరించి తీసుకు వెళుతున్నారు. ఈ స్ట్రాబేలర్ యంత్రాలు పని తీరును గుర్తించిన స్థానిక రైతులు రాయితీపై తమకు ఇవ్వాలంటూ వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖకు దరఖాస్తు చేసుకుంటున్నారు.



ట్రాక్టర్ సాయంతో తరలిస్తున్న గడ్డి మోపులు

ఎకరాకు రెండు టన్నుల మేర గడ్డి సేకరణ

స్ట్రాబేలర్ యంత్రంతో సేకరించే పొలంలో ఎకరాకు దాదాపు రెండు టన్నుల గడ్డి లభిస్తుంది. స్ట్రాబేలర్ యంత్రం సుమారు 20 కేజీల చొప్పున మూట కట్టిన గడ్డిమోపులను పొలంలోనే పడవేస్తుంది. ఎకరాకు సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. యంత్రాలను తీసుకువచ్చిన నిర్వాహకులే ఈ గడ్డిమోపులను తమ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా ఒక్కో గడ్డిమోపుకు రూ.20 చొప్పున ధర రైతుకు చెల్లిస్తుండగా మరికొంత మంది ఉచితంగా ఇస్తున్నారు. వరికోత యంత్రాల మాదిరిగానే స్ట్రాబేలర్ యంత్రాలు అందుబాటులోకి వస్తే పశువులకు పశుగ్రాసం కొరత ఉత్పన్నం కాదని రైతులు చెబుతున్నారు.

లాభసాటి వ్యాపారంగా గడ్డి సేకరణ

పాడి పశువులకు అత్యంత ప్రధానమైన ఎండుగడ్డి కొరతను కొంతమంది దళారులు లాభసాటి వ్యాపారంగా చేసుకుంటున్నారు. వరికోత యంత్రాల మాదిరిగానే ఇతర ప్రాంతాల నుంచి స్ట్రాబేలర్ యంత్రాలను కమీషన్ మీద అద్దెకు తీసుకువస్తున్నారు. పంట చేలల్లో రైతుల నుంచి గడ్డిని ఉచితంగా కాని నామమాత్రపు ధర చెల్లించి కాని సేకరిస్తున్నారు. యంత్రాల ద్వారా సేకరించిన గడ్డి మోపును ఒక్కొక్కటి పొలం గట్ల వద్దనే రూ.35కు విక్రయించి లాభాలను ఆర్జిస్తున్నారు.

ఎండుగడ్డి కొరత తీరనుంది



ట్రాక్టర్‌కు వెనుక భాగాన స్ట్రాబేలర్ యంత్రాన్ని అనుసంధానం చేసి గడ్డిని సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత నుంచి ఉపశమనం కలుగుతుంది. రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్ట్రాబేలర్ యంత్రాల వినియోగంపై రైతులకు, ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, అలమూరు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాలెంలో గడప గడపకూ..



రావులపాలెంలో గడప గడపకూ కార్యక్రమంలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేకపోయిన సంక్షేమాభివృద్ధిని రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా రావులపాలెంలో సచివాలయం-3 పరిధిలో చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.

వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని కుటుంబ సభ్యులకు వివరించారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఇచ్చిన హామీలలో 98 శాతం అమలుచేసి చూపించామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి ఏ ఇంటికి వెళ్లినా ప్రజల్లో సంతోషమే కనబడుతోందన్నారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి కనీసం రూ.లక్ష నుంచి పది లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీటీసీ గూటం తిమోతి ప్రకాష్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ, వాడపల్లి దేవస్థానం సభ్యుడు మన్యం భాను, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, పితాని రాంబాబు, కార్యదర్శి దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో చేరుతున్న బాలికలు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంజూరు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని హెచ్ఎం బీర హనుమంతరావు తెలిపారు. మరో వారం రోజుల్లో ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వాటిలో ఏదో ఒకటి విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని సూచించిందన్నారు. ఈ ఏడాది ఎంపీసీ, బైపీసీ కోర్సులను మాత్రమే ప్రారంభిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం ఎంపీసీకి 40 మంది, బైపీసీ 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకు బైపీసీ నలుగురు, ఎంపీసీకి ఏడుగురు విద్యార్థులు కళాశాలలో చేరారన్నారు. సుమారుగా మరో 30 మంది చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి కనబర్చారని త్వరలో వారు చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారన్నారు.

జనసేనకు బై.. వైఎస్సార్ సీపీకి జై



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: మండలంలోని బిళ్లకుర్రు గ్రామానికి చెందిన పలువురు జనసేన కార్యకర్తలు ఆ పార్టీకి బై చెప్పి వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. ఇంతవరకూ జనసేనలో కార్యకర్తలుగా కొనసాగిన కముజు సత్యనారాయణ, కముజు ప్రభు, శీలం నాగరాజు, కముజు శ్రీను ఆ పార్టీకి రాజీనామా చేసి బిళ్లకుర్రు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు కాకర లక్ష్మణ్, చిట్టూరి వైకుంఠం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రావులపాలెం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు.

వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలనతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పనితీరుకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజాభిమానంతో మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వలంటీర్ వ్యవస్థతోనే ప్రజలకు సంక్షేమం



అయినవిల్లిలో వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: వలంటీర్ల వ్యవస్థతోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు 100 శాతం అందుతున్నాయని, సంక్షేమ పథకాలు అమల్లో వలంటీర్లు విశిష్టమైన పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, ఎన్.పెదపాలెం, వెలవలపల్లి, చింతనలంక, మడుపల్లి, క్రాప, శంకరాయగూడెం గ్రామాలకు చెందిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించి, ప్రోత్సాహకాలు అందజేశారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ప్రముఖపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి ఉత్తమ సేవలను గుర్తించి ప్రభుత్వ మరిన్ని ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీపీ మట్టపర్తి నాగవెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచులు గుమ్మడి ప్రసాద్, శీలం వెంకటేశ్వరరావు, కాశి వీరవెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు గుత్తుల నాగబాబు, జోషికుమార్, మట్టపర్తి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలి



పాశర్లపూడిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పాశర్లపూడిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టి.నగర్‌లో తాగునీటి సమస్య ఉందని, రహదారి నిర్మించాలని కోరారు. తాగునీటి సమస్యతో పాటు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టిబాబు అభయమిచ్చారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ పిల్లి శ్రీనివాస్, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, వాసంశెట్టి చినబాబు, పార్టీ నేతలు తోరం సూర్యభాస్కర్, తులా నాగరాజు, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి



చొప్పెల్లలో అతిసార నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

అలమూరు: వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల దృష్ట్యా సంభవించే సీజనల్ వ్యాధులను తరిమికొట్టాలని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మంగళవారం అతిసార నియంత్రణ మాసోత్సవాలు, మలేరియా నివారణ మాసోత్సవం జరిగింది. ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలో వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు నేతృత్వంలో అవగాహన సదస్సులు జరిగాయి. అతిసార వ్యాధిగ్రస్తులకు సత్వరమే ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు జింక్ మాత్రలను అందజేయాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని మిశ్రమం చేసి రోగికి అందించవలసిన విధానాన్ని ఆరోగ్య, ఆశ సిబ్బందికి వివరించారు. అలాగే దోమలను వృద్ధి చెందకుండా చేయడం ద్వారా మలేరియాను నివారణ సాధ్యమేనన్నారు. ఇంట్లోను, పరిసరాల్లోను నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎన్.వెంకటేశ్వరరావు, పీవీ రమణారావు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

పచ్చనేతలు అబద్ధపు ప్రచారాలు మానాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్లా పవన్

ఆత్రేయపురం: టీడీపీ నాయకులు ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చ సభ్యుడు నల్లా పవన్ కోరారు. మంగళవారం మండలంలోని ర్యాలిలో కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసపల్లి శేషగిరిరావు ఇంటి వద్ద మండల బీజేపీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జాతీయ కిసాన్ మోర్చ సభ్యుడు నల్లా పవన్, రాష్ట్ర ఆర్గానిక్ సెల్ మెంబర్ తమలంపూడి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొని మాట్లాడారు. పవన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నామని, టీడీపీతో ఏ విధమైన సంబంధాలు లేవన్నారు. చంద్రబాబు నాయుడు తన స్వప్రయోజనాల కోసం గత నాలుగు సంవత్సరాలుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోసం తిరుగుతూ ఉన్నారన్నారు. ఇన్నాళ్లకి తన పార్టీ నేతలకు, తన పార్టీ కార్యకర్తలకు అధికార పార్టీ వైఎస్సార్ సీపీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పుకోవడానికి అమిత్‌షా అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లి కలసి వచ్చారే తప్ప ఎటువంటి పొత్తులకు రాజకీయానికి సంబంధించిన చర్చలు జరగలేదన్నారు. టీడీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా పొత్తులు కుదిరిపోయాయని, సీట్ల పంపకాలు కూడా జరిగిపోయినట్లుగా ప్రచారాలకు పాల్పడుతున్నారని, అలాంటి అబద్ధపు ప్రచారాలు చేయవద్దని హెచ్చరించారు. అనంతరం నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలకు పార్టీ కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరరావు, పాలూరి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన లైన్‌మన్ 'అడబాల'



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన లైన్‌మన్‌ను అభినందిస్తున్న డీఈ శ్రీధర్‌వర్మ

అలమూరు: మండలంలోని చొప్పెల్ల విద్యుత్ శాఖ లైన్‌మన్‌గా పనిచేస్తున్న అడబాల శ్రీరామకృష్ణ అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నంలో ప్రభుత్వ శాఖల వారీగా నిర్వహించిన ఈ పోటీల్లో ఏపీఈపీడీసీఎల్ తరఫున లైన్‌మన్ శ్రీరామకృష్ణ పాల్గొని అత్యుత్తమైన ఆట తీరును కనబర్చి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. దీంతో ఉమ్మడిగోదావరి జిల్లాల నుంచి విద్యుత్‌శాఖ తరఫున లైన్‌మన్ శ్రీరామకృష్ణ ఒక్కరే ఎంపిక కావడం. ఈనెలాఖరులో గుజరాత్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న లైన్‌మన్ శ్రీరామకృష్ణను రామచంద్రపురం డీఈ దాట్ల శ్రీధర్‌వర్మ, మండపేట ఏడీఈ జి.తిరుమలరావు, ఇన్‌చార్జి ఏఈ పి.శ్రీలక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

జొన్నాడ వద్ద లారీలను అడ్డుకున్న రైతులు

అలమూరు: మండలంలోని జొన్నాడ వద్ద ఇసుకను తరలిస్తున్న లారీలను మంగళవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఇసుక రవాణా చేసేటప్పుడు రహదారిపై ఇసుక పడిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందారు. రాత్రి వేళల్లో పొలాల నుంచి వచ్చేటప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు. జొన్నాడ బస్టాండు సెంటర్ నుంచి ఇసుక ర్యాంపు వరకూ ఉన్న రహదారిలో ఇదే పరిస్థితి నెలకొందని వారు ఆరోపించారు. ప్రతి రోజు రహదారిపై పడిన ఇసుకను శుభ్రం చేయాలని, నీటితో తడిపించాలని నిర్వాహకులకు వారు విజ్ఞప్తి చేశారు.

రహదారుల నిర్మాణానికి చర్యలు

అంబాజీపేట: ప్రజలకు అవసరమయ్యే రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.6 లక్షలతో ఎస్.ఎస్.నగర్‌లో పంట కాలువపై వంతెన నిర్మాణం, ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలతో శ్మశానవాటికకు వెళ్లే రహదారి నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. త్వరలో వంతెన, రోడ్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నామన్నారు. సుమారు 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే చిట్టిబాబుకు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుకు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

అంబాజీపేట: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మొసలపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే చిన్నారులపై ప్రేమతో చేరవేసి వారికి అర్థమయ్యే రీతిలో విద్యను నేర్పించాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ రికార్డులను, స్టాకు రూమ్‌ను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ కట్టా గోపాలకృష్ణ గోఖలే, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వెన్నపు రాంబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా శాంతకుమారి

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి నియమితులయ్యారు. కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌ల సమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా యలమంచలి బాబు రాజేంద్రప్రసాద్ నియామక ఉత్తర్వులు అందజేశారని శాంతకుమారి తెలిపారు. శాంతకుమారి నియామకంపై పలువురు సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

ద్విచక్ర వాహనం దహనం



అలమూరులో దహనమైన ద్విచక్ర వాహనం

అలమూరు: స్థానిక రథం వీధిలో మంగళవారం తెల్లవారుజామున భూపతిరాజు సుధాకర్‌రాజుకు చెందిన యాక్టీవాను గుర్తుతెలియని దుండగులు దహనం చేశారు. ఇంటి ఆవరణలో యథావిధిగా సోమవారం రాత్రి ఆరు బయట వాహనాన్ని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు. సుమారు 3.30 గంటల ప్రాంతలో ఒక్కసారిగా మంటలు వెలువడి వాహనం దహనమైనట్లు సమీపంలోని సీసీ కెమెరాల్లో దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. గతంలో ఆ ప్రదేశంలో ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు తెలుస్తోంది. యజమాని ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.గన్నవరం ఎంపీడీఓగా భారతి



పి.గన్నవరం: స్థానిక ఎంపీడీఓగా ఎం.భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతవరకూ జగ్గంపేట మండలంలో ఈఓఅండ్‌పీఆర్డీగా పని చేశారు. ఎంపీడీఓగా పదోన్నతిపై ఆమె పి.గన్నవరానికి వచ్చారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన భారతికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడ్‌మిల్లి కట్లమ్మ ఆలయ సమీప ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని ఆ గ్రామ ప్రజలు ఆందోళన చేశారు. మంగళవారం సెల్ టవర్ నిర్మిస్తున్న స్థలం వద్ద టెంట్ వేసి నిరసన చేపట్టి ఆందోళన చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణ, వంగలపూడి సూరిబాబు, కొపెల్ల శ్రీరామ్ ఉన్నారు.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని స్కిల్ హబ్‌ల్లో నైపుణ్య శిక్షణ నిమిత్తం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ లావణ్య సూచిస్తున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తోడ్పాటునందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 93808 08275 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

సంస్థల పేరు చూసి మోసపోకండి

ఆత్రేయపురం: గత కొద్ది రోజులుగా ఆత్రేయపురం మండలంలో మహాత్మాగాంధీ (ఆత్మ) పేరుతో ఒక సంస్థ వెలిసినట్లు వివిధ పత్రికల్లో ప్రచురితమైన, సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్న సంస్థకు ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యాసంస్థకు గాని తమ పాలకవర్గానికి గాని ఎటువంటి సంబంధం లేదని మహాత్మాగాంధీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు మహాత్మాగాంధీ ఎడ్యుకేషనల్ సొసైటీ పాలకవర్గాన్ని సంప్రదించాలని పీఎస్ రాజు కోరారు.